ఎర్ర సూరీడు



అప్పుడప్పుడే తెల్లవారుతోంది. కార్తీక మాసం ముంగిటా అయ్యప్ప స్వాములు, శనివారం కావడంతో భక్తులు ఆలయాల బాట పట్టారు. అదే సమయంలో సూర్యుడు ఉదయిస్తూ బయటకు వస్తుండగా ఎర్రటి నిప్పురవ్వగా కన్పించాడు. ఆకాశం లేత పసిడి వర్ణంలోకి మారింది. వికారాబాద్ టీజేఆర్ చౌరస్తా- బస్టాండ్ వెళ్లే దారిలో రోడ్డుపై నుంచి చూస్తే పట్టణానికి కుంకుమ బొట్టుపెట్టినట్లు సూర్యుడు కన్పించాడు. ఆ మార్గంలో వేళ్లేవారు సూర్యుడిని చూస్తూ ఉండిపోయారు.

- వికారాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

సీఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం



కొడంగల్‌లో సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట్, అక్టోబరు 26 : సీఎం రేవంత్‌రెడ్డి శనివారం కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. కొడంగల్‌లో తాండూరు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ దగ్గరికి చేరుకున్న రేవంత్‌రెడ్డికి కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కుడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, తహసీల్దార్ విజయకుమార్ తదితరులు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. అక్కడ వేచి ఉన్న కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రికి స్వాగతం పలకగా ఆయన వారితో కరచాలనం చేశారు. అనంతరం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన అభివాదం చేశారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, నర్సిములు నాయుడు, అంజిల్‌రెడ్డి, దేశ్యా నాయక్, మల్లికార్జున్, భీంరెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్ (ఫార్మావిలేజ్) భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు తీసుకున్నారు. రేగడిమైలారంలో సీఎం పర్యటన నేపథ్యంలో తుంకిమెట్ల నుంచి దుద్యాల గేట్, లింగంపల్లి గేటుతో పాటు ప్రధాన రోడ్డు మార్గాల్లో పోలీసులను మొహరింపజేశారు. ఈ రోడ్లను దిగ్బంధించి ప్రతీ వాహనం, వ్యక్తిని తనిఖీ చేశారు. బొంరాస్‌పేట్ మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ప్రశాంతంగా ముగిసింది.

సందర్శన

దర్గాలో స్పీకర్ మొక్కులు



వికారాబాద్, అక్టోబరు 26: వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లిలో గల మహబూబ్ సుభాన్ దర్గా ను స్పీకర్ ప్రసాద్ కుమార్ దర్శించుకున్నారు. శనివారం దర్గాలో జరుగుతున్న సందల్ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మాజీ మునిసిపల్ చైర్మన్ సత్యం సేటు, జాంగిర్ ఖాన్, ఎండీ ఆశాం, అఫ్జల్ ఖాన్, నజీర్, గౌస్, ముజాయిద్ తదితరులు పాల్గొన్నారు.

కరన్‌కోట్ పీఎస్‌లో ఓపెన్‌హౌస్



తాండూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా భాగంగా గౌతాపూర్‌కు చెందిన పాఠశాల విద్యార్థులు పీఎస్‌ను సందర్శించారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి విద్యార్థులకు లాకప్, వెపెన్స్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డ్రోన్ సర్వే వాయిదా!



తాండూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్- 2050లో భాగంగా తాండూరు మున్సిపాలిటీలో శనివారం ప్రారంభం కావాల్సిన డ్రోన్ సర్వే వాయిదా పడింది. ఇటీవల తాండూరులో పర్యటించిన టౌన్ ప్లానింగ్ ఆర్‌జేడీ నర్సింహారెడ్డి ఈనెల 26 నుంచి తాండూరు మున్సిపాలిటీలో డ్రోన్ సర్వే ప్రారంభిస్తామని, మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌తో సమీక్షించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయలేదు. దీంతో డ్రోన్ సర్వే వాయిదా పడింది.



ఫొటోషూట్ కోసం ఏర్పాటు చేసిన సెట్టింగ్

Sunday Special

మండే ఎండ.. మంచు తుపాను

షూటింగ్ స్పాట్‌గా మూడుచింతలపల్లి

నట్టింట నక్షత్రాలు, తేలియాడే పడవలు

ఇలాంటి స్పాట్లన్నీ ఒకేచోట కనువిందు

అందమైన సీనరీలతో లోకేషన్ల ఏర్పాటు

ఆయా స్పాట్స్‌ను అద్దెకిస్తూ వ్యాపారం

లోకేషన్స్‌తో పాటు, సకల వసతులు

పెళ్లి, శారీ ఫంక్షన్.. ఇలా కార్యక్రమం ఏదైనా ఫొటోషూట్ పక్కా.. ప్రధానంగా ఇటీవల కాలంలో ప్రీవెడ్డింగ్ షూట్‌లు తప్పనిసరిగా మారాయి. ఈ నేపథ్యంలో ఫొటోషూట్ స్పాట్‌లకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ఈ రకమైన షూటింగ్‌ల కోసం నగర శివారులో స్టూడియోలను ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాంటి ఫొటోషూట్‌లకు మూడు చింతలపల్లి మండలం కేరాఫ్‌గా మారింది. అక్కడ ఏర్పాటు చేసిన షూటింగ్ స్పాట్‌లు, వసతులు తదితర అంశాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

మూడుచింతలపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉదయించే సూర్యుడైనా, సంధ్య వేళ పలకరించే చంద్రుడైనా, సప్త సముద్రాలు, ఎవరెస్ట్ శిఖరం, ఢిల్లీలోని ఎర్రకోట, హైదరాబాద్‌లోని చార్మినార్, గలగల పారే గోదారి, ఇసుక ఎడారి.. ఇలాంటి ప్రదేశాల్లో మీకు ఎక్కడ ఫొటో షూట్ చేయాలని అనిపించినా.. ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. అదేంటని అవాక్కయ్యారా..! వాటన్నింటినీ ఒకే చోటకు తీసుకొచ్చారు

మిగతా 7వ పేజీలో...



ఫొటోషూట్ కోసం బావి సెట్టింగ్

దుక్కి దున్నిన.. పాలు పితికిన!

- పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా..
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాకు గురు సమానులు
- ఈ జీవితం ప్రజల సేవకే అంకితం
- ఎమ్మెల్యే కావాలనే నా కోరిక ఇంకా తీరలే..
- సొంతూరు జిల్లెలగూడలో గుడి, బడి కట్టిచ్చా
- రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

"మాది వ్యవసాయ నేపథ్యం ఉన్న కుటుంబం.. మా నాన్న ఎక్కువగా కూరగాయ పంటలు సాగు చేసేవారు. నేను కూడా సమయం ఉన్నప్పుడు పొలానికి వెళ్లి పనులు చేసేవాడిని. నాగలి పట్టి దుక్కులు దున్నేవాడిని... విత్తనాలు విత్తాను.. గేదెలకు మేత వేసి పాలు పితికాను.. పెద్దనాన్న లింగారెడ్డి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చాను. కాంగ్రెస్ పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న. ఎమ్మెల్యే కావాలన్న నా కోరిక ఇంకా తీరలేదు. నా రాజకీయ గురువుల్లో మొదటగా మా పెదనాన్న.. ఆ తర్వాత వైఎస్సార్" అని రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తన మనోగతాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. మరికొన్ని విషయాలు ఆయన మాటల్లో...

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

7



ఇన్నర్ వ్యూ



పరిగిలోని ఓ క్లినిక్‌ను తనిఖీ చేసిన ఐఎంసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

అర్హత లేని క్లినిక్‌లపై క్రిమినల్ కేసులు

- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్
- ఆర్ఎంపీ, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దు
- క్లినిక్‌లను తనిఖీ చేసిన మెడికల్ కౌన్సిల్ బృందం

పరిగి,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏలాంటి అర్హత, అనుమతి లేకుండా లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టిస్తామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పరిగిలోని రాఘవేంద్ర, హనుమాన్, గ్లోబల్, యాసిన్, పల్లవి తదితర క్లినిక్‌లు, వికారాబాద్ పట్టణంలో సందీప్ మెడికల్, నాగేందర్ క్లినిక్, స్టేషన్ రోడ్డులోని నందు క్లినిక్, నందిని మెడికల్ షాపులను లను మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీలు చేసింది. కాగా ఈ బృందం రాకతో అర్హత లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్నవారు తాళాలు వేసుకుని పరారయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లాలో 20 మంది నకిలీ వైద్యులపైన ఎన్ఎంసీ చట్టం 34.54 ప్రకారం కేసు వేయనున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్‌ల్లో అశాస్త్రీయంగా, యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ వాడుతున్నట్లు, అనుమతి లేకుండా మంచాలు వేసి నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. కాగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్ఎంపీ, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తున్నారని తెలిపారు. ఈ క్లినిక్‌లను సీజ్ చేయాలని జిల్లా వైద్యాధికారికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎంసీ సభ్యులు డాక్టర్ అరుంధతి, సాయి, విజయ్, సత్యప్రసాద్, మధుసూదన్‌లు పాల్గొన్నారు.

మేడ్చల్ కాంగ్రెస్‌లో అయోమయం

7

- చాపకింద నీరులా గ్రూపు రాజకీయాలు
- ఎవరికి వారే బాస్‌లుగా బడా నేతలు
- సీఎం వద్దకు సీనియర్ల పంచాయితీ



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- విద్యార్థులను విస్మరిస్తున్న ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్
- పరిగిలో విద్యార్థుల భారీ ర్యాలీ.. ధర్నా

7

చేతికి వైర్ చుట్టి కరెంటు షాక్ పెట్టుకొని..

- ఆర్థిక ఇబ్బందులతో కూతురితో సహా భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం
- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం
- ప్రతాప్‌సింగారంలో ఘటన



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దంపతులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యాభర్తలిద్దరూ తమ కూతురితో సహా ఆత్మహత్యకు యత్నించారు. ఇంట్లోనే చేతి మణికట్టుకు వైర్ చుట్టుకొని.. కరెంట్ షాక్‌తో ప్రాణాలు తీసుకోబోయారు. ఈ ఘటనలో భార్య మృతి చెందగా.. భర్త పరిస్థితి విషమంగా ఉంది. చివరి నిమిషంలో తేరుకున్న కూతురు ప్రాణాలతో బయటపడింది. పోచారం మునిసిపాలిటీ ప్రతాప్‌సింగారంలో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన రామకృష్ణచారి వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య విజయలక్ష్మి (35) ఇద్దరు పిల్లలతో కలిసి మూడేళ్ల నుంచి ప్రతాప్‌సింగారంలో అద్దెకు ఉంటున్నారు. అయితే కొద్దిరోజులుగా వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం మధ్యాహ్నం కరెంట్ లేని సమయంలో భార్యాభర్తలిద్దరూ ఇంట్లోని పడక గదిలో చేతి మణికట్టుకు కరెంట్ వైర్‌తో చుట్టుకొని, కూతురు చేతికి సైతం వైర్‌చుట్టి స్విచ్ ఆన్ చేసి పడుకున్నారు. కరెంట్ రాగానే భార్య విజయలక్ష్మి మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా మారింది. కూతురుకు షాక్ తగలడంతో వెంటనే తేరుకుని బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకుంది. ఆ బాలిక స్థానికులకు విషయం చెప్పడంతో 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న రామకృష్ణను ఆస్పత్రికి తరలించారు.



వికారాబాద్ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఒక్క బెడ్ మీద ఇద్దరు బాలింతలు

ఒక్క బెడ్‌పై ఇద్దరు బాలింతలు

వికారాబాద్ సర్కారీ దవాఖానాలో నరకయాతన

- రెండు మంచాలపైన ముగ్గురు...
- మంచాలపై బెడ్లు, బెడ్‌షీట్‌లు కరువు
- ఆస్పత్రిలో మందుల కొరత

వికారాబాద్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో అన్నీ సమస్యలే. పేరుకే పెద్దాస్పత్రి.. సరైన సౌకర్యాలు లేక రోగులకు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 9 సాధారణ ప్రసవాలు, 2 సిజేరియన్ ఆపరేషన్లు జరిగాయి. బాలింతలకు సరిపోను పడకలు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇద్దరు బాలింతలకు కలిపి ఒక బెడ్, ముగ్గురు బాలింతలకు కలిపి రెండు మంచాలు ఇవ్వడంతో.. చిన్నారులకు పాలివ్వడం కూడా కష్టమవుతోంది. కొంతమంది బాలింతలకు ఏకంగా ఆస్పత్రి వరండాలో బెడ్లు కేటాయిస్తున్నారు. కనీసం మంచాలపై బెడ్లు, బెడ్‌షీట్‌లు లేని దుస్థితి నెలకొంది. సౌకర్యాల గురించి ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నిస్తే దురుసుగా సమాధానమిస్తున్నారని, వేరే ఆస్పత్రికి వెళ్లండంటూ ఉచిత సలహాలు చెబుతున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. పైగా ఈ ఆస్పత్రిలో కొద్దిరోజులుగా రోగులకు అవసరమైన మందులు కూడా ఇవ్వడంలేదు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జిల్లా ఇలాఖాలోని

- మిగతా 8వ పేజీలో..

టీకాల కార్యక్రమం పరిశీలన



పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

మాడ్గుల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శనివారం అప్పారెడ్డిపల్లిలో నిర్వహించారు. పశు వైద్య శిబిరాన్ని జిల్లా వెటర్నటీ అధికారి శ్రీనివాస్‌కుమార్, టీకాల మానిటరింగ్ అధికారి అనిల్‌కుమార్‌లు పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 5,341 పశువులకు టీకాలు వేశామని, మరో 6వేల పశువులకు టీకాలు వేయాల్సి ఉందని మండల పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి తెలిపారు.

'ఉపాధి' పని తీరును మెరుగుపర్చాలి



ఉపాధి పనులపై వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

నవాబుపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల తీరును సిబ్బంది మెరుగుపర్చాలని డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం నవాబుపేట మండల పరిషత్‌లో సామాజిక తనిఖీ నిర్వహించారు. సోషల్ ఆడిట్ బృందాలతో 32 పంచాయతీల్లో 2023-24కు సంబంధించిన సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. కొన్ని గ్రామాల్లో చిన్న పొరపాట్లు చేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై తప్పులు జరగకుండా సిబ్బంది జాగ్రత్తగా పనిచేయాలని ఏపీవో లక్ష్మీమాధవిని ఆదేశించారు. పొరపాట్లు జరిగిన రూ.1.56లక్షలను రికవరీ చేయాలని ఆదేశించారు. సిబ్బందికి రూ.26,900 జరిమానా విధించామన్నారు. కుమ్మరిగూడ, వట్టిమీనపల్లి, ఏక్‌మామిడి, మూలమడ, యావాపూర్ గ్రామాల్లో తప్పులు జరిగినట్టు గుర్తించామన్నారు. సమావేశంలో ఏపీడీ సరళ, అంబుడ్స్‌మన్ రాములు, ఎంపీడీవో అనురాధ, ఏపీఎం భార్గవి, ఎస్సార్పీ రమేశ్, ఎంపీవో విజయ్‌కుమార్, ఆఫీస్ సూపరింటెంట్ అజయ్‌కుమార్, ఏపీవో లక్ష్మీదేవి, ఈసీ జ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, టెక్నికల్/ఫీల్డ్ అసిస్టెంట్లు, పలువురు కూలీలు పాల్గొన్నారు.

చేవెళ్ల గ్రంథాలయ భవనం
పనులు ప్రారంభిస్తాం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



చేవెళ్ల గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేవెళ్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):చేవెళ్లలో త్వరలోనే గ్రంథాలయ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. 'గ్రంథాలయం శిథిలం' శీర్షికతో ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మధుసూదన్‌రెడ్డి శనివారం చేవెళ్ల గ్రంథాలయ పాత భవనాన్ని పరిశీలించారు. అక్కడున్న వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి ఇప్పటికే రూ.1.80కోట్లు మంజూరయ్యాయని, మరిన్ని నిధులు కేటాయించి లైబ్రరీని హంగులతో నిర్మించేందుకు కృషిచేస్తానన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు సున్నపు వసంతం, చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, వీరేందర్‌రెడ్డి, శైలజాఆగిరెడ్డి, అధికారులు ఉన్నారు.

మొయినాబాద్‌లోనూ నూతన భవన నిర్మాణం

మొయినాబాద్: మొయినాబాద్ గ్రంథాలయన్ని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. లైబ్రరీలో అన్ని రకాల పుస్తకాలను సమకూరుస్తామని, ఇదే స్థలంలో నూతన భవన నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు షాబాద్ దర్శన్, ప్యాక్స్ చైర్మన్ రాంచంద్రరెడ్డి, రాజుగౌడ్, మహేందర్ ముదిరాజ్, రాజేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి ఉన్నారు.

షాబాద్ గ్రంథాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం

షాబాద్: షాబాద్‌లో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని మధుసూదన్‌రెడ్డి అన్నారు. సెక్రటరీ మనోజ్‌తో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించారు. లైబ్రరీకి కాంపౌండ్ వాల్ కట్టిస్తామన్నారు. త్వరలోనే ఈ నూతన భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆయనతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు రాహుల్, అక్తర్ పాషా, అన్వర్, సుభాష్‌రెడ్డి, స్వామి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జానీ, కృష్ణ, గౌరీశ్వర్, సత్యనారాయణ, ప్రశాంత్, జలీల్, రమేష్ ఉన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని జేఎన్టీయూహెచ్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. మేడ్చల్, మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి విద్యార్థులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దుక్కి దున్నిన.. పాలు పితికిన

- పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి..
- వైఎస్ఆర్ నాకు గురు సమానులు
- ఈ జీవితం ప్రజలకే అంకితం
- ఎమ్మెల్యే కావాలనే నా కోరిక తీరలే..
- సొంతూరు జిల్లెలగూడలో గుడి, బడి కట్టిచ్చా
- రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి



దివంగత వైఎస్సార్‌తో చల్లా నర్సింహారెడ్డి(ఫైల్)

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మా ఊరు జిల్లెలగూడ, సరూర్ నగర్ మండలం. నా తల్లిదండ్రులు చల్లా లక్ష్మమ్మ-పాపిరెడ్డి. మాది వ్యవసాయ కుటుంబం. ఓల్డ్ సిటీకి చెందిన చల్లా శశిరేఖతో 1993లో వివాహం అయ్యింది. ఇద్దరు పిల్లలు. బాబు రిత్‌విక్‌రెడ్డి ఎల్ఎల్‌బీ, పాప రిషికారెడ్డి ఎంబీఏ చదువుతోంది. మేము ముగ్గురు అన్నదమ్ముళ్లం. ఇంట్లో నేనే పెద్ద. ఇద్దరు తమ్ముళ్లు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి. ఇంకా ఉమ్మడిగానే ఉంటున్నాం. మా పెద్దనాన్న చల్లా లింగారెడ్డి జిల్లెలగూడ సర్పంచ్‌గా 25 ఏళ్లు సేవలందించారు.

మా గ్రామం నుంచే 'జన్మభూమి'

నేను ఉప సర్పంచ్‌గా ఉన్నప్పుడు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం జిల్లెలగూడ నుంచే స్టార్ట్ చేశారు. వైఎస్సార్ సర్కార్ అధికారంలోకి వచ్చాక మొటిసారిగా మెట్రోవాటర్‌ను గ్రామానికి తెప్పించాను.

గుడి, బడి కట్టించా

జిల్లెలగూడ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకున్నాను. తర్వాత 5 నుంచి 7వ తరగతి వరకు చంపాపేట్‌లో, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సరూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకున్నాను. ఇంటర్ బొగ్గులకుంటలోని ప్రగతి విద్యాలయంలో పూర్తి చేశాను. హైదరాబాద్‌లోని విద్యానగర్ రామచంద్ర కాలేజీలో చదివాను. నేను చదువున్న స్కూల్ శిథిలావస్థకు చేరడంతో సొంత డబ్బు ఖర్చు పెట్టి బడి నిర్మించాను. రూ.1.20 లక్షలు ఖర్చు పెట్టి బెంచీలు చేయించాను. వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పునఃనిర్మించాం.

పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి..

కాలేజీ స్థాయిలో ఎన్ఎస్‌యుఐలో క్రియాశీలకంగా పని చేశాను. విద్యార్థి సంఘ ఎన్నికల్లో పోటీచేసి గెలిచాను. మా పెదనాన్న స్ఫూర్తితో రాజకీయాల్లో అడుగుపెట్టాను.

ఎమ్మెల్యే కావాలనే కోరిక తీరలేదు

కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్లుగా కొనసాగుతున్నాను. ఎమ్మెల్యే కావాలని చిన్నప్పటి నుంచి అనుకునేవాడిని. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్‌ను ఆశించాను. కానీ నాకు దక్కలేదు. వచ్చేసారైనా పార్టీ తనకు టికెట్ ఇస్తుందనే నమ్మకం ఉంది. అధిష్టానం నా సేవలు గుర్తించి తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి కట్టబెట్టింది. నా రాజకీయ గురువుల్లో మొదటగా మా పెద్దనాన్న. తర్వాత వైఎస్సార్. సరూర్‌నగర్ జెడ్పీటీసీగా అనేక సేవలందించాను.నా సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ జడ్పీటీసీగా అవార్డు అందజేసింది.

1988లో మొదటిసారిగా జిల్లెలగూడ పంచాయతీ వార్డు సభ్యుడిగా విజయం సాధించాను. ఆ తర్వాత ఉప సర్పంచ్‌గా, సరూర్‌నగర్ మండల జెడ్పీటీసీగా, జెడ్పీ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగాను. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడిగా, మలక్‌పేట్ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాను. రెండుమార్లు డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం వచ్చింది. ఇప్పటికీ ఆ పదవిలో కొనసాగుతున్నాను. నా జీవితం ప్రజలకే అంకితం. ప్రజలకు సేవ చేయడమే నా ధ్యేయం.

నాటు కోడి, జొన్న రొట్టె అంటే ఎంతో ఇష్టం

నాటుకోడి, జొన్నరొట్టే చాలా ఇష్టం. క్రికెట్, కబడ్డీ ఆట లంటే ఎంతో మక్కువ. చిన్నప్పుడు పది మంది స్నేహితులు ఉండేవారు. వారిని అప్పుడప్పుడు కలుస్తాను.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మట్టికుప్పల తొలగింపు

ఘట్‌కేసర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'సర్వీసు రోడ్డు స్వాహా' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందించారు. ఘట్‌కేసర్‌లోని బైపాస్ రోడ్డులోని సర్వీసురోడ్డుపై అక్రమంగా పోసిన మట్టి కుప్పలను శనివారం తొలగించారు. ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపులా గల సర్వీసు రోడ్లను అక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనికి తోడు తవ్వకాలు చేసిన మట్టిని సర్వీసురోడ్డుపై పోసి నెలలు గడుస్తున్నా తీయక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా అధికారులు మట్టి కుప్పలను తొలగించారు. అయితే ఆక్రమణలు, చెట్లలో కూరుకుపోయిన సూచిక బోర్డులు కనిపించే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

మేడ్చల్ నియోజకవర్గ
కాంగ్రెస్‌లో అయోమయం

- చాపకింద నీరులా గ్రూపు రాజకీయాలు
- ఎవరికి వారే బాస్‌లుగా బడా నేతలు
- సీఎం వద్దకు సీనియర్ల పంచాయితీ



మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో గందరగోళ, అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. సీనియర్లకు పార్టీలో సముచితస్థానం, గౌరవం ఇవ్వడంలేదని కొందరు గళం విప్పారు. అధికారం ఉన్నా.. లేకున్నా పార్టీ జెండాలు మోస్తూ పదేళ్లుగా పార్టీని కాపాడిన వారికి గుర్తింపు కరువైందని నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మేడ్చల్ నియోజకవర్గంలో పార్టీ సీనియర్లకు నష్టం వాటిల్లిందంటూ విమర్శలొస్తున్నాయి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీని పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిలు అంతా తామై వ్యవహరిస్తున్నారు. ఈ నేతలు ఏళ్లుగా పార్టీకి పనిచేసిన వారిని పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నాయకులకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేకగా అనుచరులున్నారు. దీంతో ఈ నాయకులు తమ అనుచరులకు తప్ప సీనియర్లను గుర్తించటం లేదన్న వాదనలొస్తున్నాయి. పార్టీ అహర్నిషలు పాటుపడ్డ వారిని అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నారి సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కొత్త వారి ప్రాబల్యం

అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న కొత్త వారికే పార్టీలో పెద్దపీట వేస్తున్నారని సీనియర్లు వాపోతున్నారు. ఇటీవల నియోజకవర్గంలోని ఆయా పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, కార్పొరేటర్లు, మేయర్లు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పార్టీలో చేరారు. వీరికి లభిస్తున్న గుర్తింపు తమకు ఇవ్వడం లేదని సీనియర్ల ఆవేదన. పార్టీ సమావేశాల్లో, ఇతర కార్యక్రమాల్లో కొత్తగా చేరిన వారికే అందలం వేస్తున్నారని సీనియర్లు నిరుత్సాహ పడుతున్నారు.

చోటుచేసుకుంటున్న గ్రూపు రాజకీయాలు

పార్టీలో సీనియర్, జూనియర్ల వివాదంతో గ్రూపు రాజకీయలు మొదలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మొత్త ముగ్గురు జిల్లా నేతలపైనే ఆధారపడటంతో ఈ నేతల అనుచరుల మధ్య తరచూ పార్టీ వ్యవహారాల్లో పోటీ పెరిగింది. సమావేశాల సమయాల్లో ఈ ముగ్గురు నాయకుల అనుచరులు పెత్తనం తీసుకోవడం సాధారణమైంది. ఇటీవల ఎన్నుకున్న మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల నియామకంలో వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డిలు ఏకపక్షంగా వ్యవహరించి హరివర్ధన్‌రెడ్డి అనుచరులకు పదవులు రాకుండా చేశారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. వారు వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డిలపై మండిపడుతున్నారు. ఈ విషయాన్ని సీనియర్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకుపోయినట్టు సమాచారం. సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని నదరు నేతలకు సీఎం సూచించినా బడా నేతల్లో మాత్రం మార్పు రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పరిస్థితుల్లో మార్పురాకుంటే ఉన్న కాస్త పట్టూ సడలే ప్రమాదం ఉందని పార్టీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

తటస్థంగా ఉండలేక..

పార్టీ అంతర్గత రాజకీయ సమీకణాలతో తటస్థంగా ఉన్న సీనియర్లు గత్యంతరం లేక ముగ్గురు బడా నేతల్లో ఒకరి అనుచరులుగా మారక తప్పటం లేదని కొందరంటున్నారు. బడానేతల అండదండలుంటేనే పార్టీలో మనుగడ అన్న అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో నెలకొంది. పార్టీ, నామినేటెడ్ పదవులు పొందాలంటే ముగ్గురిలో ఎవరినో ఒకరిని తమ బిగ్ బాస్‌గా చేసుకోక తప్పడం లేదని ఒక కాంగ్రెస్ సీనియర్ పేర్కొనడం గమనార్హం. ప్రజల్లో సీనియర్లుగా గుర్తింపు ఉన్నా.. పార్టీలో మాత్రం తమకు విలువివ్వని పరిస్థితి ఉందన్నారు. ఇటీవల నియోజకవర్గంలో పార్టీ పెద్దలు నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల సమావేశంలో కొందరు సీనియర్లు ఈ విషయాన్ని బహిరంగంగానే పార్టీ పెద్దలకు చెప్పారు కూడా!.

రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తలకొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వెల్జాల జెడ్పీ పాఠశాల విద్యార్థినులు కె.స్పందన ఎ.భవాని ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో డిస్ట్రిక్ ఖోఖో అసోసియేషన్ నిర్వహించిన జూనియర్ స్థాయి పోటీల్లో బాలికలు ప్రతిభ చూపారు. ఈ నెల 28-30వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు స్పందన, భవానీ ఎంపికయ్యారని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పరమేశ్ శనివారం తెలిపారు. విద్యార్థినులను హెచ్ఎం నసీమా, టీచర్లు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రీనాలిసా, తపస్యలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

ఆమనగల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆమనగల్లులోని వివేకా విద్యా భారతి పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో స్కూలుకు చెందిన ఆరుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. రీనాలిసా, తపస్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరులో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థినులను శనివారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్ సత్కరించారు. పీఈటీలు శంకర్, అంజు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు కొడంగల్ బాలురు ...



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు కొడంగల్ జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు వీరేశ్, లచ్చానాయక్ ఎంపికైనట్లు పీడీ అజీజ్ తెలిపారు. వీరు అండర్-17, అండర్-14 బాలుర విభాగ రాష్ట్ర జట్లకు ఎంపికకావడంతో శనివారం వారిని హెడ్‌మాస్టర్ మురళీధర్, టీచర్లు సన్మానించారు. ఈ నెల 28-30వ తేదీ వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులను విస్మరిస్తున్న ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ ● విద్యార్థుల భారీ ర్యాలీ.. ధర్నా

పరిగి,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పరిగిలో విద్యార్థులు భారీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడతూ, కాంగ్రెస్ అధికారంలోకి పది నెలలు దాటినా విద్యార్థులకు సంబంధించి నిధుల విడుదలలో ఎందుకు జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచాలని, లేనిచో ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, వెంకటరమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మండే ఎండ.. మంచు తుపాను

(5వ పేజీ తరువాయి)

ఫొటోషూట్ స్పాట్‌ల నిర్వాహకులు. అద్దె చెల్లిస్తే చాలు.. రోజంతా మీకు నచ్చిన, మీరు మెచ్చిన స్పాట్‌లో ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చు. రంగుల ప్రపంచాన్ని అర చేతిలో వైకుంఠంగా చూపించేందుకు నిర్వాహకులు తమ నైపుణ్యానికి పదును పెట్టారు. ఇప్పటికే మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలో ల్యాండ్ ఆఫ్ లవ్.(ఎల్‌వోఎల్) పేరుతో ఓ స్పాట్ సందడి చేస్తుండగా జగ్గంగూడలో మరిన్ని షూటింగ్ స్పాట్లు వెలిశాయి.

ఒకే చోట 80కిపైగా స్పాట్లు

ఫొటో షూట్ స్పాట్లతో ఆయా గ్రామాల్లో నిత్యం సందడి వాతావరణం నెలకొం టుంది. ఫొటోషూట్ స్పాట్ల పేరుతో ఓ కొత్త ప్రపంచాన్ని కళ్ల ముందుకు తీసుకువస్తున్నారు నిర్వాహకులు. సుమారు 6 నుంచి 7 ఎకరాల్లో ఫొటోషూట్ స్టూడియో నిర్మాణాలను చేపట్టారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక పెరటి తోట, కోటను తలదన్నేలా భవనాలు, సముద్రంలో తేలియాడే పడవలు, పక్కింటికి ఉన్న పిట్టగోడ, ఔరా మెయిల్ వంటి రైల్ బండి, మండే ఎండ, మంచు తుపాను, నట్టింట నక్షత్రాలు, ఎడ్ల బండి, వ్యవసాయ పరికరాలు, విద్యుత్ కాంతుల లైట్ హౌజ్ వంటి ఎన్నెన్నో.. స్పాట్‌లు ఈ స్టూడియాల్లో దర్శనమిస్తాయి. ఒక్కో స్టూడియోలో సుమారు 80కు పైగా స్పాట్‌లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.





ఫొటో షూట్ కోసం ఏర్పాటు చేసిన ఊయల, లవ్ అక్షరాల సెట్టింగ్

ఫొటోషూట్ స్పాట్‌లకు ఆదరణ పెరగడంతో మూడు పువ్వులు 30 కాయల్లా ఈ స్టూడియోల వ్యాపారం నడుస్తూ నిర్వాహకుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

రోజుకు రూ.25వేల చొప్పున

ఒక్క ఫొటో షూట్‌కు పది మంది వరకు లోపలికి అనుమతిస్తారు. అందులోనే ఫొటోగ్రాఫర్‌తో కలిపి ఒక రోజుకు సుమారు రూ.25వేల వరకు అద్దెను వసూలు చేస్తున్నారు. అదే హాఫ్ డే కోసం అయితే రూ.14వేలను చెల్లించాల్సి ఉంటుంది. ఫొటో షూట్ కోసం వచ్చిన వారు ముస్తాబవ్వడానికి ఏసీ గదులతో పాటు తినడానికి భోజనాలను సైతం సరఫరా చేస్తారు. ఒకవేళ రాత్రి ఫొటోషూట్ చేసుకుంటే అవసరమైన లైటింగ్‌ను ఏర్పాటు చేస్తారు. నిర్వాహకులు తక్కువ ఖర్చుతో ఇలా సకల సదుపాయాలను కల్పిస్తుండటంతో యువత ఇక్కడి షూటింగ్ స్పాట్‌లలో ఫొటో షూట్‌పై ఆసక్తి చూపుతున్నారు. దీంతో శివారు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫొటో షూట్ స్టూడియోలకు డిమాండ్ భారీగా పెరిింది. ఇది రోజురోజుకూ పెరుగుతోంది. ఫొటోషూట్ సదుపాయాలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో లాంగ్ టూర్, మ్యూజిక్ పార్టీలు, స్టార్ హోటళ్లను పక్కన పెట్టి మరీ ఫొటోషూట్ దారిపడుతున్నారు యువతరం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో
ఏసీబీ హడల్

ఆరు నెలల్లో ఆరుగురు అధికారుల ట్రాప్.. అయినా మారని అవినీతి ఉద్యోగుల తీరు

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ లంచగొండి అధికారుల గుండెల్లో ఏసీబీ రైళ్లు పరిగెత్తిస్తోంది. ఏసీబీ అంటేనే హడల్‌గా మారింది. ఆరు నెలల్లో ఆరుగురు అధికారులను ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయినా అవినీతి విషయంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులే ఎక్కువగా ఏసీబీ ట్రాపుల్లో పట్టుబడుతున్నారు. డిపార్ట్‌మెంట్‌లోని కాంట్రాక్ట్ ఉద్యోగులను లంచాల కోసం అధికారులు వేధిస్తుండడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా హైదరాబాద్ శివారులోనే ఉండటంతో భూముల విలువ కోట్లలో ఉంది. ధరణి ఏర్పాటుతో భూ సంబంధిత సమస్యలెక్కువయ్యాయి. ఇదే అదనుగా చిన్న పనులకు సైతం రెవెన్యూ అధికారులు రూ.లక్షల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నారు. పాస్ పుస్తకాలిచ్చేందుకు శామీర్‌పేట తహసీల్దార్ ఏకంగా రూ.10లక్షలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. గతంలో కీసర తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి ఏకంగా రూ.కోటి నగదుతో దొరికి కటకటాల పాలై చివరికి జైలులోని ఆత్మహత్య చేసుకున్నారు. అయినా లంచగొండి అధికారుల తీరులో మార్పు రాక ప్రజలు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. కలెక్టరేట్ అధికారులు కూడా లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం సంచలనంగా మారింది. ఓ సొసైటీ అధికారి, పరిశ్రమల విభాగ అధికారులు కలెక్టరేట్‌లో లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ కూడా ఓ కేసు నుంచి తప్పించేందుకు లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డాడు. తాజాగా ఘట్‌కేసర్ మున్సిపల్ ఏఈ, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లు ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులకు చిక్కారు. ప్రజలు ఎవ్వరికీ లంచాలివ్వొద్దని, ప్రభుత్వ పనులను హక్కుగా భావించి ఉద్యోగులతో చేయించుకోవాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. అయితే లంచగొండి అధికారులు మాత్రం లంచాలకు తెగబడుతూనే ఉన్నారు.

న్యూస్ బాక్స్

మొక్కలు నాటి సంరక్షించాలి



ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న చైర్మన్

ఘట్‌కేసర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో గల భూనీల సమేత రంగనాయక స్వామి దేవాలయ ఆవరణలో శనివారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. స్వామి వారి పల్లకీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్, నాయకులు నర్రి శ్రీశైలం, పోలగోని రాజేష్, ఈవో భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



సాంస్కృతిక ప్రదర్శనలో కళాశాల విద్యార్థినులు

తాండూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం శాలివాహన డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల ఉపాధ్యక్షులు కల్వ రాధాకృష్ణ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లాలని సచించారు. కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌చంద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవి ఉన్నత స్థానాలను ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సిద్ది లింగయ్య, డైరెక్టర్లు కట్కం వీఈరేందర్, బంటారం సుధాకర్, శివకుమార్, లక్ష్మారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ట్యాంకులను శుభ్రంగా ఉంచాలి

తాండూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రజలకు సరఫరా చేసే తాగునీటికి సంబంధించిన ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి ప్రణీత్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మిషన్ భగీరథ(గ్రిడ్) ఏఈ ప్రతిభ ఆధ్వర్యంలో 33 గ్రామాల్లో పనిచేసే మిషన్ భగీరథ వాటర్‌మెన్‌లకు రెండో రోజు మోటారు, పైప్‌లైన్ల రిపేర్లు, పైప్‌ల జాయింటింగ్, స్టార్టర్ మరమ్మతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ(గ్రిడ్) ఏఈ ప్రతిభ మండల పంచాయతీ ఇన్‌చార్జి అధికారి ఆనంద్‌రావు, ఆయా గ్రామాల వాటర్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్నా పట్టించుకోరా?

● శిథిలావస్థలో మిషన్ భగీరథ ట్యాంక్ ● పట్టించుకోని అధికారులు

మూడుచింతలపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ సమీపంలో నివసిస్తున్న ప్రజలు ఎప్పుడు కూలుతుందోనని తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. గత 30 ఏళ్ల క్రితం గ్రామంలో జనాభా ప్రకారం మంచినీటిని సరఫరా చేసేందుకు 60,000 లీటర్ల సామర్థ్యం హెడ్ ట్యాంక్ నిర్మించారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ మంచి నీటి పథకం ప్రవేశ పెట్టడంతో ఈ ట్యాంక్‌నే మరమ్మతులు చేసి దానికి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ అని మార్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానికి ఒక్కసారి కూడా మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. పిల్లర్లు పెచ్చులూడి ప్రమాదకరస్థితికి చేరింది. ట్యాంకులోని నీరూ లీకవుతోంది. దీంతో చుట్టు పక్కల వారు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు పలుసార్లు అధికారులకు ట్యాంక్‌కు మరమ్మత్తులు చేయాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ మిషన్ భగీరథ అధికారులు వచ్చినా మొక్కుబడిగా వచ్చి ఫొటోలు తీసుకుంటున్నారు కానీ పరిష్కరించడంలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌కు మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొల్తూర్‌లోని మిషన్ భగీరథ ట్యాంక్, పెచ్చులూడుతున్న పిల్లర్

రక్తదానం చేసి ప్రాణదాతలవ్వాలి



ఘట్‌కేసర్: రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఘట్‌కేసర్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలవ్వాలని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి అన్నారు. చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి సతీష్ కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పూడూరు: పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్ఐ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మండలం నుంచి 20మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. వారితో పాటు ఎస్ఐ మధుసూదనరెడ్డి రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్



కమిషనర్ చంద్రశేఖర్

ఘట్‌కేసర్, అక్టోబరు 26: ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఘట్‌కేసర్ కమిషనర్‌గా పనిచేసిన ఎండీ సాబేర్ అలీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. మీర్‌పేట్ కమిషనర్‌గా పనిచేసిన చంద్రశేఖర్ ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు.

నాగారం మున్సిపల్ కమిషనర్‌గా భాస్కర్‌రెడ్డి

కీసర రూరల్: నాగారం మున్సిపల్ కమిషనర్‌గా పి.భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన నాగారంకు బదిలీ అయ్యారు. నాగారం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన రాజేందర్‌కుమార్ గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. నాటి నుంచి దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించారు.

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం కృషి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మూసీ నది పునర్‌జీవం కార్యక్రమంలో భాగంగా శనివారం ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్, కొత్తగూడ సమీపంలోని మూసీనదిని సందర్శించారు. మూసీని అభివృద్ధి చేయడం వల్ల కులవృత్తులకు ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, పీర్జాదీగూడ మేయర్ అమర్‌సింగ్ పాల్గొన్నారు.

ఒక్క బెడ్‌పై ఇద్దరు బాలింతలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు, రోగులకు ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందులు కరువు

ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో కొద్ది రోజులుగా 44 రకాల మందులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం, కీళ్లనొప్పులు, జలుబు, దగ్గు, కడుపునొప్పితో పాటు తదితర సమస్యలతో వచ్చే వారికి పరీక్షలు చేసి వైద్యులు చీటి రాసిస్తున్నారు. కానీ ఆసుపత్రిలో 44రకాల మందులు లేకపోవడంతో రోగులు బయట కొనుక్కోవాలని ఆస్పత్రి సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. శనివారం కేరెల్లికి చెందిన నర్సింహులు జలుబు చేయడంతో ఆసుపత్రికి వచ్చాడు. ఆయనకు డాక్టర్ మందుల చీటి రాసి ఇవ్వగా అందుకు దగ్గ మందులు లేవని అక్కడ సిబ్బంది పేర్కొన్నారు. అదేవిధంగా తాండూరుకు చెందిన బాల్‌రాజ్ వికారాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే అతని వద్ద డబ్బులు లేక పోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి రెండు రోజులుగా తిరుగుతున్నా మందులు లేవని వెనక్కి పంపిస్తున్నారని వాపోయాడు. అంతేకాకుండా ఆసుపత్రిలో పార్కింగ్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచందర్ స్పందిస్తూ.. శనివారం తెల్లవారుజామునే ఆస్పత్రికి అన్ని రకాల మందులు వచ్చాయని, రోగులకు అవసరమైన వాటిని అందిస్తామని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో కాన్పులు జరుగుతుండడంతో బాలింతలకు సరిపోను బెడ్లు కేటాయించలేకపోతున్నామని, కొత్త ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ ఇబ్బందులు తప్పవని ఆయన అన్నారు.

క్రైం కార్నర్

చదువుకోసం నగరానికి వచ్చి..

● అద్దె గదిలో ఉంటూ గంజాయి విక్రయం
● ఇద్దరు డిగ్రీ విద్యార్థులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు
● 1.16 కేజీల గంజాయి పట్టివేత

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చదువుకునేందుకు నగరానికి వచ్చి మేడ్చల్ పరిధిలోని కేఎల్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న డిగ్రీ విద్యార్థులు అద్దె గదిలో ఉంటూ గంజాయిని సరఫరా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.16కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) సీఐ ఏ.సుభాష్ చందచీర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన త్రినేత్ర, రఘుపతి సహా మరో విద్యార్థి కలిసి చదువుకోసం నగరానికి వచ్చి కేఎల్ ఆర్ కాలనీలో అద్దె గదిలో ఉంటూ డిగ్రీ చదువుతున్నారు. అయితే రఘుపతి సీలేరు నుంచి కొద్ది మొత్తంలో గంజాయిని గుట్టుగా తెచ్చి గదిలో దాచిపెడుతున్నాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులతో కలిసి అవసరమైన కస్టమర్లకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో రఘుపతి మిగిలిన ఇద్దరు స్నేహితులకు కమీషన్ రూపంలో డబ్బులు చెల్లించేవాడు. అద్దె గదిలో ఉంటూ గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు శనివారం గదిలో ఉన్న ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

చెరువులో చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి



విక్టర్(ఫైల్)

కీసర రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విక్టర్ అనే వ్యక్తి పోచారం మున్సిపాలిటీ ఇస్మాల్‌ఖాన్‌గూడలో నివాసముంటున్నాడు. తన ఇద్దరు పిల్లలు కీసర మండలం రాంపల్లిదాయరలోని జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నారు. వారిని పాఠశాల వద్ద వదిలి చేపలు పట్టేందుకు సమీపంలోనే ఉన్న జాఫర్‌కాన్‌గూడలోని చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అదుపుతప్పి విక్టర్ చెరువులో పడిపోయాడు. ఈత రాకపోవటంతో నీటిలో మునిగి మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

పరిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పరిగి మునిసిపల్ పరిధిలోని భవానీ హోటల్ వెనుకాల కట్టపై శనివారం సాయంత్రం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిగి సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అనంతయ్య ఎర్రగడ్డపల్లి గ్రామ వాసిగా గుర్తించారు. అతడి మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అదృశ్యం



రాణా ప్రతాప్

పూడూరు, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : యువకుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామానికి చెందిన రాణాప్రతాప్(28) ఈనెల 25వ తేదీన పూడూరు మండల పరిధిలోని చీలాపూర్‌లోని పెద్దగొల్ల శ్రీకాంత్ కూతురి శుభకార్యానికి వచ్చాడు. అదేరోజు రాత్రి బయటికి వెళ్లివస్తానని రాణాప్రతాప్ కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్ రావడంతో చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో శ్రీకాంత్ చెన్‌గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

వీధి కుక్క దాడి.. బాలుడికి తీవ్రగాయాలు

బషీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్క దాడిలో ఓ బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బషీరాబాద్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. సాయిల్‌గౌడ్ మనువడు రుత్విక్(5)స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి ఆడుకునేందుకు వెళ్తుండగా అటువైపుగా వస్తున్న కుక్క వెంబండించి కిందపడేసి బాలుడి చేయిని కొరికింది. గమనించిన స్థానికులు బాలుడిని కాపాడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇటీవల మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైందని, పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్ దగ్ధం



దగ్ధమవుతున్న బైక్

పరిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఓ బైక్ దగ్ధమైంది. పరిగికి చెందిన నర్సింహులు అనే వ్యక్తి పరిగి నుంచి సయ్యద్‌పల్లికి వెళుతుండగా పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి శివారులోని సగుణఫ్యాక్టరీ దగ్గర బైక్ కార్బైడ్ షార్ట్ సర్క్యూట్ వచ్చి మంటలు చెలరేగాయి. అప్పటికే గమనించిన నర్సింహులు బైక్‌ను వదిలేసి దూరంగా వెళ్లాడు. బైక్ పూర్తిగా దగ్ధమైంది.

సారాయి విక్రయిస్తున్న వ్యక్తి బైండోవర్

బషీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సారాయి విక్రయిస్తూ పట్టుబడిన మండలంలోని భోజ్యానాయక్‌తండాకు చెందిన అంగోత్ కిషన్‌ను శనివారం ఎక్సైజ్ పోలీసులు శనివారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. తహసీల్దార్ వెంకటేశ్ మాట్లాడుతూ తండాలో ఇకపై సారాయి తయారు చేసినా, విక్రయించినా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మరోసారి పట్టుబడితే రూ.లక్ష జరిమానాతో పాటు కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బషీరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ రవికుమార్ విలేఖర్లతో మట్లాడుతూ సారాయి తయారీ కేంద్రాలు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైనా పట్టుబడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

మేడ్చల్ టౌన్ 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5వ తేదీన జరిగే ఆటో డ్రైవర్ల మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ పిలుపునిచ్చారు. మేడ్చల్‌లో ఆటో డ్రైవర్ల మహాధర్నా పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత బస్సు సౌకర్యం తలపెట్టిన సర్కార్ ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బ తీసిందన్నారు. రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో పరమేష్, వినోద్, రాజు గౌడ్, ఎల్లయ్య, శంకర్, నర్సింహా, సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థులతో ఎన్ఐఎన్ శాస్త్రవేత్త మహేష్ కుమార్

ఘట్‌కేసర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని జాతీయ పౌష్టికాహార పరిశోధనా సంస్థ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో గల రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం కోలోక్వియం ఫ్యూజన్ ఆఫ్ గ్లోబల్ ఇంటలెక్ట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామానాయుడు, సీఈవో సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్ ద్వివ్యాశర్మ, హెచ్ఎం శ్రీరంజని పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పుస్తకాలతో భక్తులు

కొడంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాటిమీదిపల్లికి చెందిన స్వయం సేవక్ మనోహర్ హనుమాన్ చాలీసా పుస్తకాలను పంపిణీ చేశారు. కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు ఆలయంలో శనివారం పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు.

సాంకేతిక పరిజ్ఞానానికి వర్క్‌షాప్‌లు దోహదం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, 26 (ఆంధ్రజ్యోతి): కళాశాల్లో నిర్వహించే వర్క్‌షాప్‌లు సంకేతిక పరిజ్ఞానానికి దోహదపడతాయని సీఎంఆర్ కళాశాల ఎంబీఏ హెచ్‌వోడీ నవీన్‌కుమార్ తెలిపారు. మేడ్చల్, మైసమ్మగూడలోని ఎమ్మార్ కళాశాలలో శనివారం 'ట్రస్ట్ ది మాజిక్ ఆఫ్ ది బిగినింగ్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో నిర్వహించే వర్క్‌షాపుల వల్ల సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాపులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'ఎల్లో కలర్ డే'



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యప్రదర్శన

తాండూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాండూరులోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో శనివారం ఎల్లో కలర్ డేను నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈవెంట్‌లతో ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలో, ఆకర్షణీయమైన రైమ్స్, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్, డైరెక్టర్ సతీష్ పాల్గొన్నారు.

తుర్కపల్లికి పీహెచ్‌సీ మంజూరు



పీహెచ్‌సీ ఉత్తర్వు కాపీని అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

శామీర్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట మండలం తుర్కపల్లికి సీఎం రేవంత్‌రెడ్డి నూతన ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి(పీహెచ్‌సీ)ని మంజూరు చేసినట్లు తుర్కపల్లికి చెందిన మేడ్చల్ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఆంధ్రజ్యోతికి వివరించారు. శామీర్‌పేటలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిని రెండేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో శామీర్‌పేటలోని ఒకే ఆస్పత్రి భవనంలో పాత పీహెచ్‌సీ, కొత్త సీహెచ్‌సీ కొనసాగుతున్నాయి. దీంతో శామీర్‌పేటలోని పాత పీహెచ్‌సీని కాంగ్రెస్ ప్రభుత్వం తుర్కపల్లికి మంజూరు చేసింది. ఈ ఉత్తర్వు కాపీని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తీసుకున్నట్లు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కొత్తగా మంజూరైన పీహెచ్‌సీని నెల రోజుల్లో తుర్కపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

శామీర్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా గోధావరిఖనిలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు తుర్కపల్లిలోని విజేత టెక్నో పాఠశాలకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 25న వికారాబాదాద్ జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో అండర్-17 బాలురల విభాగంలో జశ్వంత్, అంకుశ్‌రెడ్డి, అండర్-14 బాలికల విభాగంలో అక్షిత, శ్రావణి రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల చైర్మన్ జీడిపల్లి రాంరెడ్డి, కరస్పాండెంట్ రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, పీఈటీ ప్రశాంత్ అభినందించి సన్మానించారు.

ఎక్కడి చెత్త అక్కడే!



ఐనెల్లిలో నాలుగురోజులుగా చెత్త లోడ్‌తో రోడ్డుపై ఉన్న ట్రాక్టర్

తాండూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం పేరుతో గ్రామాల శుభ్రత కోసం కార్యక్రమాలు చేపడుతుంటే తాండూరు మండలం ఐనెల్లిలో మాత్రం ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. నాలుగు రోజుల కిందట పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఓ ట్రాక్టర్‌లో కొంతమేరకు చెత్త నింపారు. అట్టి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తుండగా డీజిల్ అయిపోవడంతో ట్రాక్టర్ ఆగిపోయింది. దీంతో కార్మికులు చెత్త ట్రాక్టర్‌ను మాజీ జడ్పీటీసీ మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ పట్లోళ్ల స్వప్న ఇంటి ముందు వదిలేశారు. అలా వదిలేసిన ట్రాక్టర్ నాలుగు రోజులు గడుస్తున్నా అక్కడి నుంచి తరలించడం లేదు. దీంతో కాలనీలో దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ ప్రత్యేకాధికారి, కార్యదర్శి పర్యవేక్షణ లేకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల మధ్య ఉన్న చెత్త ట్రాక్టర్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

కొడంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగడిరైచూర్ గ్రామానికి చెందిన బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ నర్మద కిష్టప్ప శనివారం పార్టీకి రాజీనామా చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో ఆమె బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు.

'నర్మద కిష్టప్ప కాంగ్రెస్ కార్యకర్త కాదు'

బొంరాస్‌పేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నర్మద కిష్టప్ప కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కాదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో నర్మద కిష్టప్ప బీఆర్ఎస్‌లో చేరడంతో సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ అని ప్రచారం కొనసాగడంపై స్పందించారు. ఇటీవల ఎన్నికల్లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యే బరిలో పోటీ చేసి ఓడిపోయి డిపాజిట్ దక్కని ఆమెకు కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

వక్ఫ్‌భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

పరిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సాజిద్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ పరిధిలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములు కబ్జాకు గురవుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు శనివారం ఆయన వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలించారు. నివేదికను కలెక్టర్, వక్ఫ్‌బోర్డు సీఈవోకు సమర్పిస్తామని తెలిపారు.

సంక్షిప్తంగా..

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పూడూరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, సొసైటీ చైర్మన్ సతీష్‌రెడ్డి తదితరులు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బాలమణి, మండల సీనియర్ నాయకులు యువజన సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మర్పల్లి: మండలంలోని బూచన్‌పల్లి, దామస్తాపూర్ గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మహేశ్వరి ఆధ్వర్యంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, శాంతకుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, బీజేవైఎం నాయకులు మధుకర్, సుభాష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మధు, శ్రీశైలం గౌడ్, వీరేశం, కల్లెం మహేందర్‌రెడి పాల్గొన్నారు.

కురువ కులస్థులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వొద్దు

పెద్దేముల్: కురువ కులస్థులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వొద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లిఖార్జున్ మాదిగ పేర్కొన్నారు. మాదాసి, మాదరి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వరాదని పేర్కొంటూ పెద్దేముల్ తహసీల్దారు కిషన్‌కు శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఒకవేళ వారికి ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేస్తే ఎస్సీ దళితసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం

దోమ: మోత్కూర్ గ్రామం కేసిలమ్మ తండా పాఠశాలలో ఉపాధ్యాయులకు శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. 12 సంవత్సరాలుగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణి, స్వాతిలను దోమ మండల ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి చందు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నౌషిన్, ఉపాధ్యాయులు ఇందిరా, గ్రామ మాజీ సర్పంచ్ హరిచందర్, రెడ్యా, ఖదీర్, రవి, దేవి, కవిత, చందర్, గోవింద్, హన్మ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు పరిగి తాలుకా కార్యవర్గం

పరిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు పరిగి నియోజకవర్గ కమిటీ శనివారం పరిగిలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. పరిగి నియోజవర్గ అధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధానకార్యదర్శిగా కె.శివశంకర్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, అధికార ప్రతినిధి జాఫర్‌పల్లి యాదయ్య, కోశాధికారిగా సి.అంజయ్య, సలహాదారులుగా ఎం.కృష్ణయ్య, సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా యాదయ్య, సలహకమిటీ సభ్యులుగా ఉప్పరి కృష్ణయ్య, టి.వెంకటయ్య, పరిగి పట్టణ అధ్యక్షుడిగా బేగరి చందు, ఉపాధ్యక్షుడు రాజేందర్, ప్రధానకార్యదర్శిగా కంకంటి సందులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాలమహనాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్, శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.